# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-01-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు లక్ష్యమని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

- ❖ కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని మంత్రి టీ జీ భరత్ స్పష్టం చేశారు.

- ❖ శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి రేపు ఉదయం 10 గంటల 17 నిమిషాలకు పీఎస్ఎల్వీ సీ-62 రాకెట్‌ను ఇస్రో ప్రయోగించనుంది.

- ❖ గుజరాత్ లోని వడోదర వేదికగా జరుగుతున్న మొదటి వన్డే క్రికెట్ మ్యాచ్ లో న్యూజిలాండ్.. భారత్‌కు 301 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

==========================

సముద్రంలోకి వృధాగా పోతున్న నీటిని రాయలసీమ ప్రాంతానికి తరలించి ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే పోలవరం-నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు లక్ష్యమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుపై రేపు సుప్రీం కోర్టులో వాయిదా ఉన్న నేపథ్యంలో మంత్రి జలవనరుల శాఖ ఉన్నతాధికారులు, న్యాయవాదులతో దృశ్య మాధ్యమ విధానంలో ఈరోజు సమావేశమయ్యారు. ఏటా వృధాగా సముద్రంలో కలుస్తున్న 3 వేల టిఎంసిల నీటిలో.. 200 టి.ఎం.సి.లు మాత్రమే తీసుకునేలా ఈ ప్రాజెక్టును ప్రతిపాదించామని మంత్రి అన్నారు. గోదావరి నీటి వివాద ట్రిబ్యునల్ - GWDT అవార్డు ప్రకారం మిగిలిన నీటిని వినియోగించే హక్కు ఆంధ్రప్రదేశ్ కు ఉందని స్పష్టం చేశారు. కేంద్రానికి ప్రాజెక్టు సాధ్యాసాధ్యాల నివేదిక - ఫీజిబులిటీ రిపోర్ట్ సమర్పించామని, వారి సూచనల మేరకే మార్పులు చేస్తున్నామని అధికారులకు మంత్రి రామానాయుడు వివరించారు.

==========================

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. కర్నూలులోని న్యాయవాదుల ఆధ్వర్యంలో ఈ రోజు నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో మంత్రి

పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హైకోర్టు బెంచ్‌ను నగరంలో ఏ, బీ, సీ క్యాంపుల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

==========================

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపటి నుంచి నాలుగు రోజుల పాటు తిరుపతి జిల్లాలో పర్యటించనున్నారు. చంద్రగిరి నియోజకవర్గంలోని నారావారిపల్లికి రేపు సాయంత్రం 5 గంటలకు ముఖ్యమంత్రి చేరుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలను కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సంక్రాంతి వేడుకలకు హాజరవుతారని, ఈ పర్యటన నేపథ్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు.

==========================

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఆత్రేయపురంలో జరుగుతున్న ఆత్రేయపురం ఉత్సవాలును జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, ఎస్.పి. రాహుల్ మీనా, కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు, రాష్ట్ర సంస్కృతిక కమిషన్ ఛైర్ పర్సన్ పి. తేజశ్విని ఈ రోజు ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో మొదటి రోజు ఈత పోటీలు నిర్వహించారు. రేపు సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పేరుతో డ్రాగన్ పడవల పోటీలు నిర్వహించనున్నారు. జాతీయ స్థాయిలో జరిగే ఈ పోటీలకు పలు రాష్ట్రాల నుండి క్రీడాకారులు హాజరవుతున్నారు. ఉత్సవాల నిర్వహణకు అన్ని పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

==========================

శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి రేపు ఉదయం 10 గంటల 17 నిమిషాలకు పీఎస్ఎల్వీ సీ-62 రాకెట్‌ను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రయోగించనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. రాకెట్ ప్రయోగానికి సంబంధించి ఈ రోజు మధ్యాహ్నం 12 గంటల 17 నిమిషాలకు కౌంట్‌డౌన్ ప్రక్రియ ప్రారంభమైంది. న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్) రూపొందించిన తొమ్మిదవ పూర్తిస్థాయి వాణిజ్య ఉపగ్రహమిది. ఈ ప్రయోగం ద్వారా 8 విదేశీ, 7 స్వదేశీ ఉపగ్రహాలను ఒకేసారి కక్ష్యలోకి పంపనున్నారు.

==========================

సర్ లూయీ బ్రెయిలీ అంధుల జీవితాల్లో దీపం వెలిగించిన మహానుభావుడని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఈరోజు జరిగిన సర్ లూయీ బ్రెయిలీ 217వ జయంతి వేడుకలలో పాల్గొన్న మంత్రి.. లూయీస్ బ్రెయిలీ చిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. బ్రెయిలీ రూపొందించిన లిపి ఆధారంగా అంధులు తమ జీవితాలను తీర్చి దిద్దుకునే అవకాశం కలిగిందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

==========================

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం కంటే ముందే దక్షిణ భారతదేశంలో బ్రిటిష్ పాలకుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మొదటి స్వాతంత్ర్య పోరాటం జరిపిన రేనాటి యోధులు వడ్డే ఓబన్న జయంతిని ఈ రోజు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహించింది. అనంతపురం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత, అనంతపురం, హిందూపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, పార్థసారథి పాల్గొని వడ్డే ఓబన్న చిత్రపటానికి

పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగగా జరుపకోవటం ఎంతో శుభ పరిణామమని, ఆయన నేటి యువతకు ఆదర్శమని అన్నారు. వడ్డే ఓబన్న జీవితం యువతకు ఒక స్ఫూర్తిదాయకమని అనకాపల్లి జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణ రావు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ  పేర్కొన్నారు. పోలవరం జిల్లా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్, పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, బాపట్ల జిల్లాలో కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

==========================

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజులు పొడి వాతావరణం నెలకొని ఉంటుందని, పొగమంచు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారిణి జి.లక్ష్మీ వెల్లడించారు.

==========================

భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా ఈ రోజు గుజరాత్ లోని వడోదర వేదికగా తొలి క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 300 పరుగులు చేసింది. న్యూజిలాండ్ ఆటగాళ్లలో డారిల్ మిచెల్ 84, హెన్రీ నికోల్స్ 62, డెవన్ కాన్వే 56 పరుగులు చేయగా.. భారత బౌలర్లలో మహ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ రెండేసి వికెట్లు తీశారు.

==========================

==========================